# వనిత

ఇది కలకత్తాలో జరిగిన ఒక కథ. ఇది ఒక వాస్తవ సంఘటనా లేక కేవలం కథేనా అని అడిగితే, నేను జవాబిస్తాను. కలకత్తాలో ఏ ప్రాంతంలో జరిగిందని మాత్రం అడక్కండి ప్లీజ్. నేను ఆ నగరాన్ని ఐదారుసార్లు సందర్శించాను. కానీ, ఆ ఊర్లపేర్లు మాత్రం నాకు పెద్దగా తెలియదు. కలకత్తా గురించి తలుచుకుంటేనే నాకు ఒక విషయం గుర్తుకు వస్తుంది. మామూలుగా ఏ నగరంలోనైనా కొత్తకారు యజమానులకు, తమ కారుకు ఏమైనా గీతలు పడతాయోమోనని, సొట్టలు పడతాయోమోనని భయం, ఉత్కంఠ వేధిస్తాయి. కొంతమందికి అంటే, హృదయాన్ని పంచడమన్నా లేక దానం చేయడమన్నా తెలియని వాళ్ళకి గుండెజబ్బు కూడా వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి టెన్షన్లు కలకత్తాలోని కొత్త కారు యజమానులకు ఎక్కువకాలం ఉండవు. కారణమేమిటంటే, ఒకటి రెండు రోజుల్లోనే ఆ కారుకు కావాల్సిన భగవద్గీతలు సొట్టలు పడతాయి. ఆ కొత్తకారుని, ఆటోరిక్షా గానీ, లేక మరేదైనా వాహనం గానీ పక్క నుంచి రాసుకుని వెళితే అక్కడి డ్రైవర్లకు అదే మాత్రం తప్పనిపించదు. మొదటిసారి కొత్తకారుకి ఏదైనా దెబ్బతగిలినప్పుడు, ఆ కారు యజమానికి కోపం వచ్చి, ఆ ప్రక్కకారు డ్రైవరుకు కొన్ని తిట్లు ప్రసాదించాలనుకుంటే, అతను కాస్సేపు ఆగాలి కదా! గుద్దేసిన తర్వాత కూడా అతను ఏమీ జరగనట్టేకదా అతని పురోగమనం. కొంచెం స్పీడుగా వెళ్ళి ఓవర్‌టేక్‌చేసి అతన్ని పట్టుకుందామంటే మరికొన్ని ప్రమాదాలు జరుగుతాయేమో! ఎలాగైనా అతన్ని పట్టుకోగలిగితే అతని నోటినుంచి ఏమి వినాల్సి వస్తుందో లేక అతని చేతినుంచి ఏమి తినాల్సి వస్తుందో అది ఆ భగవంతుడికే తెలుసు. అందుకే వార పత్రికలలో ధననష్టం, మానహాని, కలుగుతుందనే జ్యోతిష్య ప్రవచనాలకు సార్థకం చేయకుండా, కారు యజమానులు కేవలం ధన నష్టంతోనే సరిపుచ్చుకుంటారు. కొత్తకారు గలవాళ్ళు చిన్న చిన్న ప్రమాదాలు జరిగినా కారుకు వెంటనే రిపేర్లు చేయించరు. ఎందుకంటే, కాలం వృథా అవడమే కాకుండా మరుసటి దినం కారుకు మళ్ళీ పాతకథ మొదలవుతుంది. కాబట్టి పెద్ద డామేజ్ ఏమీ కాకపోతే అమ్మడానికి ముందే కారుకు పూర్తిగా రిపేర్లు చేయించడమే మేలు కదా! ఈ విధంగా ఆ నగరంలో కొత్తకారు యజమాన్లకు తమ కార్లగురించి ఎటువంటి అందోళనా ఉండటానికి ఆస్కారంలేదు.

కలకత్తా పేరెత్తేసరికి ఇంత దూరం చెప్పాల్సివచ్చింది. కలకత్తా నగరాన్ని గురించి వివరణే ఇవ్వాలంటే మహాభారతం లాంటి ఒక వ్యాసమే అవుతుంది. కలకత్తాకి

వెళ్ళొచ్చినవాళ్ళు గానీ, అక్కడ కొంతకాలం ఉండొచ్చిన వాళ్ళు గానీ, ఆ నగరాన్ని గురించి చెప్పడానికి చాలా ఉంటుంది. లండన్‌లో "ఓ! కులుకుత్తా లేక ఓ! కలకత్తా" అనే ఒక స్టేజ్ ప్రోగ్రామ్ చాలాకాలం ప్రదర్శింపబడింది. భారతీయుల్ని చాలా నీచంగా చిత్రించడం బ్రిటీష్‌వాళ్ళకు అలవాటే కదా!

అయ్యో! కథ మళ్ళీ పెడదారి పట్టిందే. కథ పెడదారి పడితే పట్టవచ్చు కానీ, కథంటూ మొదలయిన తరువాత పడితే ఫరవాలేదు. ఇక్కడ అసలు కథే మొదలు కానిదే! కలకత్తాలో జరిగిన ఒక కథ అని ప్రస్తావించడం మాత్రమే జరిగింది. ఇంతకీ చెప్పబోయే విషయమేమిటంటే, ఈ కథలో స్థల నామాలు ఏమీ ఉండవు. వ్యక్తుల నామధేయాలు నిజమైనవి కావు. ఇహ కథలోకి ప్రవేశిద్దామా!

కథానాయకుడి పేరు జాయ్ ముఖర్జీ. ఒకప్పటి హిందీ సినిమా హిరోకి ఇతనికి ఏదైనా సంబంధం కానీ, పోలిక గానీ ఉందా అని అడిగితే కాదు, అవును అని కూడా సమాధానం చెప్పాల్సి వస్తుంది. సంబంధం వరకూ కాదు అనే సమాధానం సరియైనదే. ఏ దూరపు చుట్టరికమైనా ఉందనడానికి ఎలాంటి పత్రాలు కానీ సాక్ష్యాలు కానీ లేవు. ఇకపోలిక దగ్గరికొస్తే, ఒక్క విషయంలో మాత్రం అవుననక తప్పదు, సినిమా జాయ్ ముఖర్జీ జడ్డి నవ్వు మాత్రం ఇతనికి ఉపగ్రహం ద్వారానో వచ్చి ఉంటుంది. అతని ఎత్తు ఇతనికి రాలేదు కానీ, అతన్ని మించిన లావుతో పాటు శ్రీకృష్ణుడి మేని ఛాయ ఇతనిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. స్థూలకాయుడైన ఒక పొట్టి మిథున్ చక్రవర్తిలా ఉంటాడు.

నలభై మూడేళ్ళు వచ్చేవరకూ అతనికి పెళ్ళి కాలేదంటే, దానికి తగిన కారణం కానీ, కారణాలు కానీ ఉండవచ్చు. శారీరక లోపమేదైనా ఉందా లేక నాడీ క్షయమనే జబ్బు ఉందా అని అతని మిత్రుల అనుమానం. ఎందుకంటే, చిన్నప్పటినుంచీ అతనికి ఆడవాళ్ళ గురించి కానీ, "విషయం" అనే విషయం గురించి కానీ మాట్లాడటానికి వైముఖ్యత ఉండేది. పెళ్ళి విషయంలో అనాసక్తత చూపడానికి మూడు కారణాలు ఉండేవి...వివాహ ప్రాయం దాటిన ముగ్గురు చెల్లెళ్ళపోషణాభారం జాయ్ ముఖర్జీ దుర్బల భుజస్కంధాలపై పడటంతో అతని మనసు రెక్కలు విరిగిన పక్షిలా బలహీనమై పోయింది. శతవిధాల ప్రయత్నించినా కూడా, ముగ్గురు చెల్లెళ్ళలో ఒక్కొక్కరికి ముప్ఫయ్ ఏళ్ళ వయస్సు వచ్చే వరకూ పెళ్ళికాలేదు. ఆవయస్సులో వాళ్ళకి పెళ్లయినపుడు, ఇక పెళ్ళి కొడుకుల వయసు మీరే ఆలోచించండి. ఆఖరు చెల్లెలి పెళ్ళిసమయానికి అతని తల్లి మరణించింది. ఆ పెళ్ళి అయిపోయిన తరువాత రెండు సంవత్సరాలు అతను స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి ఉపయోగించుకున్నాడు. అతని ఆప్తమిత్రుడు ఒకరు ఒక చక్కటి అమ్మాయిని అతనికి వధువుగా ఎంపికచేసేసరికి

జాయ్‌ముఖర్జీకి నలభైమూడేళ్ళు వచ్చేశాయి. ఆ వధువుకు ఇరవై ఎనిమిదేళ్ళు. పేరు వనిత, చూడటానికి ఆమె అందంగానే ఉంటుంది. సామాన్యమైన కుటుంబం వారిది. ఆమె ఇంటర్మీడియట్ వరకూ చదువుకుంది. చదువులో ఆమె సమర్ధురాలే కానీ, డిగ్రీ చదవడానికి ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించలేదు. ఇంటర్మీడియెట్ ఫస్ట్‌క్లాసులో పాసయిన తరువాత కొంతకాలం ఆమె, టైపు, షార్టుహేండ్ నేర్చుకుంది. అయినా కూడా, ఉద్యోగ లబ్ధి అనే అదృష్టం మాత్రం ఆమెకు కలుగలేదు. రెండుసార్లు ప్రైవేటు కంపెనీల్లో టెంపరరీ టైపిస్టుగా పనిచేసింది.ఆకర్షణీయమైన కట్నం ఇవ్వలేకపోవడంతో యువకులెవరూ కూడా చేయి అందుకోవడానికి ముందుకు రాలేదు. జాయ్‌ముఖర్జీ సంబంధం తీసుకువెళ్ళిన వ్యక్తి, కట్నం ఇవ్వాల్సిన ప్రసక్తే లేదని, అదేకాక అతని కంపెనీలో ఆమెకి ఒక ఉద్యోగం లభించే అవకాశం ఉందని చెప్పడం వలన ఆమె ఈ వివాహానికి ఒప్పుకుంది. పెళ్ళయి ఒక నెలైనా కాకుండానే, వనిత తన ఉద్యోగ విషయాన్ని భర్త దగ్గర ప్రస్తావించింది. ఒక క్లర్క్ పోస్టు గానీ, టైపిస్టు పోస్టుగానీ ఖాళీ కాకుండా అవకాశం రాదని,తన కంపెనీలో కొత్త పోస్టు సృష్టించడం వీలు కాదని జాయ్ ముఖర్జీ చెప్పేటపుడు నిరాశా మేఘాలు కమ్ముకున్న ఆమె ముఖం చూపి కొన్నాళ్ళకు ఎవరైనా ఒకరు కలకత్తా వదిలి వెళ్ళవచ్చని ఒక వేళ తన కంపెనీలో అలాంటి అవకాశం రావడానికి ఆలస్యమైతే, మరో కంపెనీలో నైనా ప్రయత్నిస్తానని, ఆ నెల్లాళ్ళ పెళ్ళికొడుకు వాగ్దానం చేసాడు.

వారి దాంపత్య జీవితం సంతృప్తికరంగా నడుస్తోందా అని అడిగితే తృప్తిపడక వాళ్ళు చేయగలిగేదేముంది అనేప్రతి ప్రశ్నే దానికి జవాబు. జాయ్‌ముఖర్జీ ఆమెను సంతోషపరచడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. తనకున్న స్వంత ఫ్లాట్ గురించి అతను గర్విస్తుండేవాడు. వనితకి కూడా ఆ వసతి గురించి చాలా సంతోషంగా ఉండేది. తన తల్లిదండ్రుల ఇంటితో పోల్చినప్పుడు, ఈ ఫ్లాట్‌కు ఒక మూడు నక్షత్రాల హోదా కళ్ళుమూసుకొని ఆపాదించవచ్చని ఆమెకి అనిపించింది. వనితకి సర్వదా తోడు ఉండటానికి నగరం వెలుపలి నుంచి ఒక యాభైయేళ్ళ పనిమనిషిని కుదిర్చాడు. ఆమె పట్ల అపార అనురాగం గల ఆ జాయ్‌ముఖర్జీ రోజూసాయంత్రం ఆఫీసు అయిపోయిన వెంటనే ఇంటికి పరుగెత్తి వచ్చేవాడు. రోజుకు కనీసం నాలుగైదుసార్లు ఇంటికి ఫోన్‌చేసి మాట్లాడేవాడు. అప్పుడప్పుడు కొత్తపెళ్ళికూతురిని సినిమాలకు, షికార్లకు తరువాత నుంచి హోటల్స్‌కి తీసుకెళ్ళేవాడు. ఆమెతో పాటు ప్రతీరాత్రి పదీ, పదకొండు గంటల వరకూ టీవీ ప్రోగ్రామ్స్ చూసేవాడు. వస్తుతః అతనికి టీవీ అంటే పెద్ద మోజుండేదికాదు. వివాహానికి ముందు రాత్రి తొమ్మిది గంటలకే అతను నిద్రపోయేవాడు. కానీ, వనితకి కొన్ని దూరదర్శన్ ప్రోగ్రామ్స్ అంటే ఇష్టముండటంతో ఆ ఇడియట్ బాక్స్‌ని అతను కూడా ప్రేమించక తప్పలేదు. తన

ఇష్టాయిష్టాల గురించి అతను శ్రద్ధ తీసుకునే పతిదేవుడి పట్ల వనితకు ప్రేమను మించిన కృతజ్ఞతా భావం స్ఫురించింది.

ఆ విధంగా వారి ప్రేమజీవితం నిర్విఘ్నంగా ముందుకు సాగుతోంది. కానీ ప్రేమకథలో నాయికా నాయకులు మాత్రమే కాదు కదా ఉండేది. వారి ప్రేమ ప్రగతికి అవరోదాలు కలిగించే విలన్ నామధేయస్యా, నీచపాత్ర గోత్రస్య ఒకడైనా ఉండాలి కదా! మామూలు కథల్లో అంటే సినిమా కథల్లో నాయకుడికి కానీ, నాయికకుకానీ, అంటే వారిద్దరికీ కానీ వివాహం జరగడంతో ఈ విలన్ పాత్ర అప్రస్తమౌతుంది. కొన్ని తమిళ్ సినిమాల్లో అలాంటి వివాహ దృశ్యంచూపిస్తూ ఉండగా, వధూవరుల గుండెలపై దండల్లోంచి "శుభం" అనే అక్షరాలు ముందుకు దూసుకు రావడం మామూలే. మన వనిత జీవితంలో విలన్ ఆమె పేదరికం అయితే, జాయ్ ముఖర్జీ ప్రేమజీవితం మొలకెత్తడానికి అడ్డుసవాళ్ళు అతనికి ముగ్గురు చెల్లెళ్ళే కదా! జాయ్ ముఖర్జీ వనితలకు వివాహపూర్వం ప్రేమపర్వం అనేది లేనేలేదు కదా! పెళ్ళి చూపులు జరిగిన రోజు నుంచి జాయ్‌ముఖర్జీకీ వనితపట్ల అపరిమితమైన అనురాగమూ, వాత్సల్యము మరియు రకరకాల భావనలు కలగసాగాయి. అదే సమయంలో తనకన్నా పదిహేనేళ్ళు చిన్నదైన వనిత మనసా వాచా కర్మణా తనని ప్రేమించగలుగుతుందా అనేసందేహం అతన్ని వెంటాడింది. తనకన్నా పదిహేనేళ్ళు పెద్దవాడైన అతను ప్రేమించగలుగుతాడా లేదా అనే భయం వనితను కూడా వేధించింది. అతని పట్ల ఆమెకు ఎక్కువగా గౌరవవాదరణ భావాలే కలిగాయి. వారిద్దరూ భార్యాభర్తలుగా వ్యవహరించినా కూడా వనితకు అతనిని ఒక మామగా లేద సంరక్షకుడిగా చూడటానికి మాత్రమే సాధ్యమయింది. పడకగదిలో అతని నిర్దేశానుసారంగా లేక ఇంగిత ప్రకారంగా వర్తించడం తన పరమకర్తవ్యమని ఆమె భావించింది. అతనిని ఒక ప్రేమికుడిగా వీక్షించడం కానీ, ఆయనతో ఏర్పడుతున్న లైంగిక సంపర్కాలకు రతీలీలాస్థాయి కల్పించడం గానీ, ఆమెకు సాధ్యపడలేదు. పూర్తిగా ఆయన హితానుసారంగా బతుకుతున్న ఒక భార్యగా ఆమె తయారయ్యింది.

జాయ్‌ముఖర్జీ కూడా ఆమెని ఒక చిన్నమ్మాయిగానే చూడగలిగాడు. ఇంతటి రూపవతీ, సుశీల ఆయిన అమ్మాయి భార్యగా లభించినందుకు దేవతలందరికీ తన కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆమెతో ఎంతో ప్రేమతో కారుణ్యంతో వాత్సల్యంతో వ్యవహరించాలని ఆమెని ఏవిధంగా కూడా నొప్పించకూడదని అతను నిర్ణయించుకున్నాడు. ఆమె సుఖ సంతోషాల కొరకు ఏంచేయడానికైనా అతను సిద్ధంగా ఉన్నాడు. లైంగిక విషయంలో ఆమెకన్నా తను తక్కువ వాడిగా ఉండకూడదని అలాగని తనకు కామపిచ్చి ఉన్నట్టు అనుకోకూడదనే

పట్టుదల అతనికి ఉండేది. తనకు లభించే సుఖం, సంతోషం, తృప్తి కన్నా ఎక్కువ తనకంటే వయసులో చాలా చిన్నదైన భార్యకు లభించాలని అతను హృదయపూర్వకంగా ఆశించాడు. ఈ విధంగా ఆ భార్యభర్తలు పరస్పర కర్తవ్యాలను, ఎంతో సత్యసంధంగా నిస్వార్థంగా నెరవేరుస్తూ వచ్చారు.

అవన్నీ ఎలావున్నా, నవయువ దంపతుల మధ్య మామూలుగా కనబడే ప్రగాఢా వేశాలు కానీ, తనవితీరని ఆరాటం గానీ, వారి మధ్య ఏర్పడలేదు. నలభైమూడేళ్ళ ముసలి వాడికి, ముప్ఫై నాలుగేళ్ళ "మజిల్" వాడి శారీరక సామర్థ్యం ఉంటుందా! అలాగే ఇరవై ఎనిమిదేళ్ళ అమ్మాయికి పరువాల పద్దెనిమిది అమ్మాయికి ఉండవలసిన కొత్తదనం కానీ, యువత్వం కానీ ఎలా ఉంటుంది?

సరియైన వయసులో వివాహం చేసుకునే అదృష్టం లేని వాళ్ళుకొత్త ఆలస్యంగా పెళ్ళి చేసుకుంటే, ఇలాగే బతుకుతారు. ఈ విషయంలో ఇతరుల అభిప్రాయాలతో పనేంటి? పాపం, వాళ్ళని వాళ్ళిష్టం వచ్చినట్టు బతకనీయండి. వాళ్ళ దాంపత్య జీవితం సంతృప్తికరంగానే నడుస్తుంది. ఎందుకంటే జాయ్ ముఖర్జీ వనితకు ప్రథమ భర్త. ఆమె అతనికి ప్రథమ భార్య. వాళ్ళ కలయిక పులకరింతలను పోల్చిచూసుకోవడానికి ఇలాంటి పాత అనుభవాలేమీ లేవుగా! ఇప్పుడు పోయిందేముంది వనిత ఇంకా మధ్యవయస్సుకి చేరలేదు కదా! జాయ్ ముఖర్జీ కూడా ఇంకా ముదిరిన బెండకాయ కాలేదు.

వాళ్ళ ఫ్లాట్ నంబర్ డెబ్భై ఒకటి. అది వారిద్దరి వయస్సులు కలిపితే వచ్చేది అని వనిత కనుక్కున్నప్పుడు అతనికి సంతోషం కలిగింది కానీ, తన వయస్సు గూర్చి ఎవరైనా ప్రస్తావించడం అతనికి నచ్చేది కాదు. తన ప్రియ ప్రేయసిని ఆ డిస్కవరీ గురించి అతను పొగిడాడు. ఆ నంబరు తమ దాంపత్య జీవితానికి శుభసూచకమని అతను నామ్మాడు.

కానీ, జాయ్‌ముఖర్జీ జీవితానికి అశుభసూచకాలైన సంకేతాలు డెభ్భై ఐదో ఫ్లాట్ నుంచి రావడం మొదలయింది. ఆ ఫ్లాట్‌లో అతనికి ఎంతో మంచి మిత్రుడైన ఇంజనీర్ ఛటర్జీ ఉండేవాడు. అతనికి యాభైయ్యేళ్ళు దాటాయి కానీ, పిల్లలు మాత్రం లేరు. అతని బావమరిది విశ్వజిత్ అక్కడే వుండి బి.కామ్. పాసయ్యాడు. టైపు, షార్టుహేండ్ కూడా నేర్చుకున్నాడు. అతను జాయ్‌ముఖర్జీ చెల్లెళ్ళతో కలిసి మెలసి ఉండటం వలన ఆ ఇంటిలో ఒక సభ్యుడిగా ఉండేవాడు. ముగ్గిరి చెల్లెళ్ల పెళ్ళిళ్ళ తరువాత ఒంటరివాడుగా ఉండిపోయిన జాయ్‌ముఖర్జీకి విశ్వజిత్ సందర్శనమే కరువయ్యింది. జాయ్‌ముఖర్జీ పెళ్ళికి ఛటర్జీ, అతని భార్య, విశ్వజిత్ దగ్గరి బంధువులుగా వ్యవహరించడం వలన వనితకి వారితో అక్కడే పరిచయమేర్పడింది. జాయ్ ముఖర్జీ ఇంటికి వచ్చిన తరువాత, వనిత రాకపోకలు జరపడానికి ఉన్న ఒకే ఒక

చోటు ఛటర్జీఇల్లు. శ్రీమతి ఛటర్జీ కూడా వీలున్నప్పుడల్లా వనిత ఇంటికి వచ్చేది. ఛటర్జీ భార్యతో పగలంతా బోరు కొట్టకుండా వనిత కాలక్షేపం చేయడం గురించి జాయ్‌ముఖర్జీకీ సంతోషం కలిగింది.

కానీ, ఆ దెబ్భై అయిదవ నంబరు ప్లాట్‌లో ఉంటున్న ధూమకేతువైన విశ్వజిత్ మీద జాయ్‌ముఖర్జీకి ఎటువంటి సదాభిప్రాయం ఉండేదికాదు. అతను చదువుకునే రోజుల్లోనే అమ్మాయిల చుట్టూ ఉపగ్రహంలా తిరిగేవాడు. ఉపద్రవంలాగా మారేవాడు. తన చెల్లెళ్ళ చుట్టూ జులాయిలా అతను తిరగడం జాయ్ ముఖర్జీకీ నచ్చేది కాదు. కానీ, అతను ఛటర్జీ బావమరిది కావడం వలన, అతన్ని దూరంగా ఉంచడం కూడా సాధ్యం కాలేదు. జాయ్‌ముఖర్జీ తల్లి అతనికి నచ్చచెప్పేది. విశ్వజిత్ చిన్నపిల్లవాడే కదా! నీ చెల్లెళ్ళతో కాక ఇంకెవరితో ఆడుకుంటాడు. అదీ గాగ అతను ఇంట్లో పనులకి ఎంతో ఉపయోగ పడుతున్నాడు. దుకాణం నుంచి కిరాణా సామాన్లు కావలసి వచ్చినా, ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టాలన్నా అతనే వెళ్తాడు."

వనిత ఇంటికి వచ్చిన తరువాత విశ్వజిత్ ఏదో ఒక సాకుతో రోజు ఇంటికి వచ్చేవాడు. అలా రావడం జాయ్‌ముఖర్జీకి చాలా చిరాకుగా ఉండేది. ఒకపెద్ద కంపెనీలో మేనేజింగ్ డైరెక్టర్ దగ్గర సెక్రటరీగా పనిచేస్తున్న అతను కనీసం పగలంతా దూరంగా ఉంటాడు. కదా అని సమాధానపడే జాయ్‌ముఖర్జీకి, అతను వనితతో పగలు అప్పుడప్పుడూ టెలిఫోన్‌లో మాట్లాడుతున్నాడని తెలుసి భాద కలిగింది. కానీ, విశ్వజిత్‌కి ఎక్కువ చనువివ్వవద్దని వనితతో చెప్పడానికి కూడా అతను సంకోచించాడు. ఎందుకంటే, అతన్ని శంకిస్తే ఒక విధంగా తన భార్యను శంకించినట్టేకదా! ఏదేమయినా, ఆమె మాత్రం అలాంటి చనువివ్వదని అతనికి ప్రగాఢమయిన నమ్మకం ఉండేది. ముప్ఫై దాటిన ఆ విశ్వజిత్ కి పెళ్ళిఅయిపోయుంటే అది విశ్వకళ్యాణానికి చాలా తోడ్పడుతుందని అతను విశ్వసించాడు. ఆ విషయం గురించి జాయ్‌ముఖర్జీ రెండు మూడు సార్లు ఛటర్జీతో మాట్లాడటం కూడా జరిగింది ఒక మంచి అమ్మాయిని కుదిర్చే ప్రయత్నంలో ఉన్నామని ఛటర్జీ జవాబిచ్చాడు. ఒకసారి వనిత విశ్వజిత్‌తో ఈ విషయం గురించి ప్రస్తావించినప్పుడు.,

"నేను పెళ్ళంటూ చేసుకుంటే అది వనితనే" అని నవ్వుతూ చెప్పాడు.

"కాకపోతే, ఒక అబ్బాయిని పెళ్ళిచేసుకోమని నీకెవరయినా సలహా ఇస్తారా?" అని ఆమె అడిగింది.

"నేనన్నది అదికాదు, నాకు వనిత లాంటి వనితే నచ్చుతుంది," అని అతను చురుగ్గా జవాబిచ్చాడు.

అది విని సిగ్గుపడాలా అని ఒక క్షణం సందేహించి, అతని ముందు ఆ కార్యక్రమం అనవసరమని ఆమె నిర్ణయించుకుంది.

వారాలు, నెలలు గడుస్తున్నకొద్దీ, వనితకు భర్తపట్ల భక్తి, ఆదరణలే తప్ప, పెద్దగా ప్రేమోద్దీపన మాత్రం కలగలేదు. జాయ్‌ముఖర్జీకి కూడా కామావేశం గల ఒక కాముకిని తన భార్యలో చూడాలనే కోరిక ఎన్నడూ కలగలేదు. తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఉంటూ, తన నిర్దేశాలని పాటిస్తూ బతుకుతున్న ఒక మంచి భార్యేకదా ఆ ప్రాయంలో ఉన్న ఒక మనిషికి అవసరం. పతిహితానుసారంగా వర్తిస్తున్న ఒక భార్యేకదా పతివ్రత.

వాళ్ళ మధ్యనున్న ఆదర్శసంపన్నమైన దాంపత్య జీవితంలో ఏదో ఒక అపశృతి లేదా అని వనిత మనసులో ఆమె శరీరంలోని ప్రతి అణువూ మంత్రిస్తున్నట్టు ఆమెకు సందేహం కలిగింది. ఆదే సమయంలో వసపిట్టలా వాగుతూ ఉండే విశ్వజిత్‌ని ఆమె ఎంత దూరంగా ఉంచాలనుకుంటే, అతను ఇంకా దగ్గరవుతూ వస్తున్నాడు. అతన్ని నిందించినా కానీ, తిట్టినా కానీ, అతని పెదవుల మీద చిరునవ్వు చెక్కు చెదరకుండానే ఉంటుంది. ఎదుటివారిని ఆకట్టుకునేటట్టు మాట్లాడటం అతని ప్రత్యేక లక్షణం. ఎన్నెన్ని విషయాలలో అతనికి పరిజ్ఞానం ఉంది!

“వనితా! ఆయన ఎందుకు మిమ్మల్ని” వనిదా” అని పిలుస్తున్నారు? దాని గురించి మీరేమి అడగరా? ఒక మంచి పేరుని ఎందుకిలా చంపుతున్నారు?” అని ఒకరోజు విశ్వజిత్ ఆమెని అడిగాడు.

“అదిఫరవాలేదు, “తా”బదులు “దా” కదా వాడుతున్నారు. కానీ వనిధే అని పిలిస్తే బిధబే అని వినిపిస్తుంది కదా”! అని వనిత నవ్వుతూ ప్రశ్నించింది.

ఇంకొకరోజు, “ముఖర్జీమామ చాలా మంచివాడు. భర్తగా ఆయన ఒక ప్రేమనిధికావచ్చు కానీ, ఒక యువతికి కావలసినవన్నీ ఇవ్వడానికి ఈ వయస్సులో ఉన్న మామవల్ల అవుతుందా! మామ అంటే, మామే. మామ అల్లుడితో సమానమెలా అవుతాడు? “వేర్ అండ్ టేర్” అనే మాట నువ్వు విని ఉంటావు కదా? అది ఒక్క యంత్రానికే కాదు, మానవ శరీరానికి కూడా వర్తిస్తుంది. కొన్ని చాలా నాణ్యమైన యంత్రాలకు ఒక వేళ లోపాలేమి కలగపోయినా కూడా “మెటల్ ఫెటీగ్” అనే ఒక రకం బలహీనత కలుగుతుంది. అదే రకంగా, వయసు మీద పడుతున్న వాళ్ళకు అవయవాలన్నీ సరిగా పనిచేస్తున్నా కూడా వారికి “మెంటల్ ఫెటీగ్” అనే శక్తి క్షయం సంభవిస్తుంది. అని ఆపడుచువాడు అన్నాడు.

"ఓయ్ విశ్వజిత్! నువ్వేం ఖంగారు పడవద్దు. నా భర్తకు "ఫిజికల్ ఫెటీగ్" లేదు, "మెంటల్‌ఫెటీగ్ లేదు, ఒక వేళ ఉన్నా, నేనది భరిస్తాను, అని ఆమె జవాబిచ్చింది.

"నువ్వు ఒక్క మనిషినే భర్తగా చూశావు, అందువల్ల సరియైన భర్త..యువకుడైన భర్త ఎలా ఉంటాడనేది నీకు ఊహించడానికి కూడా సాధ్యం కాదు. యవ్వనస్థుడైన భర్త ఉన్న నీ స్నేహితురాళ్ళతో దీన్ని గురించి మాట్లాడి చూస్తే నీకు కొంచెం అవగాహన కలగవచ్చు." అని పెద్దనిపుణుడిలాగా అతను సలహా ఇచ్చాడు.

"నువ్వు ఇంత చమత్కారంగా మాట్లాడతావు కానీ, నీకు సిగ్గు ఎగ్గూ ఉండవద్దా? ఆడవాళ్ళు తమ భర్తలని బజారులో దొరికే వస్తువులైనట్లు చర్చిస్తారా?"

"వనితా! నువ్వు ఏ యుగంలో బతుకుతున్నావు? ఈ నగరాన్ని నువ్వు ఒక పల్లెటూరుగా మార్చేస్తావా? చదువుకున్న భార్యలెవరయినా ఇలాంటి విషయాల గురించి చర్చిస్తారు. మీలో మీరు మాట్లాడుకోకపోతే విషయాలెలా తెసుస్తాయి మీకు. "పతియే ప్రత్యక్ష దైవం" అని చెప్పేదంతా పాతకాలపు మూఢనమ్మకం. భర్త అంటే అతను ఒక మామూలు మానవుడే అతనికి చర్చించకపోవడమనేది ఉండటానికి వీలులేదు. మనము పోప్, శంకరాచార్య, రామకృష్ణపరమహంస, ఇండియన్ ప్రెసిడెంట్, ఇండియన్ ప్రైమ్ మినిష్టర్, వీళ్ళందరి గురించి చర్చించుకోవడం లేదా! కొంతమంది రవీంద్రనాథ్ టాగూర్ గురించి, కావాలంటే జ్యోతి బసు గురించి మాట్లాడుకుంటారు. అలాంటప్పుడుఒక భర్త మాత్రం ఎందుకు చర్చా విషయం కాకూడదు.

"నా భర్తను నేనొక చర్చా విషయంగా చేసుకోను. కావాలంటే నేను ఒక పాత కాలపు మనిషినని ఒప్పుకుంటాను."

"మీరలా ఒప్పుకుంటే మాత్రం ఏం లాభం? వనితా! మనందరం బతికేది ఈ ఒక్క బతుకు మాత్రమే. పూర్వ జన్మలు కానీ, రాబోయే జన్మలు కానీ, టీవీ సీరియల్స్ లాగా ఉండవు గదా! భార్యభర్తల బంధం అంటే ఏడుజన్మల పాటు ఉంటుందని కొంతమంధి నమ్ముతారు. అలాంటప్పుడు ముఖర్జీ మామతో ఇది మీ ఆఖరి జన్మబంధం అంటే ఫరవాలేదని అనుకోవచ్చు. కానీ, ఇదే మొదటి జన్మ అయితే, తరువాతి జన్మలలో మీ మధ్యన ఉన్న వయో వ్యత్యాసం పెరుగుతూనే వస్తుంది. కనీసం ఇది వినైనా ఒకసారి నవ్వకూడదా!

సరే ఇలా చూడు! నేను నవ్వుతున్నాను.......చాలా అని ఆమె వినోదపూర్వకంగా నవ్వింది.

ఆహా! ఎంత దివ్యంగా ఉంది ఆ నవ్వు. ఇంత యాంత్రికంగా నవ్వడానికి నువ్వు సినిమాల్లో గానీ, నాటకాల్లోగానీ అభినయించావా? లేదా ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేశావా? ఇహ నాముందు నవ్వాలని అనుకుంటే మాత్రం ఇలావద్దు. నీ హృదంతెరిచి నవ్వాలి.”

అలా విల్లేదు, విశ్వజిత్, హృదయం తెరిచి నవ్వడానికి నేనేం హనుమంతుణ్ణి కానే అని చెప్పి ఆమె పెద్దగా నవ్వింది.

“ఇక నవ్వులాటలు చాలు వనితా! నేను చెబుతున్నది మన జీవితాల గురించి సీరియస్ అయిన విషయం. అసలు మీ పెళ్ళి ఏ పదిహేడెళ్ళకో పద్దెనిమిదేళ్ళకో జరిగి ఉండాల్సింది. పరుగులు తీసే పదహారేళ్ళ ప్రాయం గురించి కవులు సుందరగీతాలు రచించలేదా. అలాంటిపది లేదా పదకొండు మధువిధు సంవత్సరాలు మీరు ఎలాగా నష్టపోయారు. ఈ వయసులో నీకు పెళ్ళి జరిగింది. అది కూడా మీకంటే పదిహేనేళ్ళు పెద్దవాడైన ఒక ముసలివాడితో, దీనివలన మీ జీవితానికి ఏర్పడిన తీరని నష్టం మీకు అర్థం కావడం లేదు. ముఖర్జీ మామ మీకు ఒక సంరక్షకుడిగా వచ్చాడు. ఇప్పుడు కూడా ఆయన రాకపోతే మీ యవ్వన సంవత్సరాలు ఇంకా ఎన్ని నష్టం అయ్యేవి అని ఆలోచించిన మీకు ఆయనపైన ఒక కృతజ్ఞతా భావం మాత్రమే ఉంటుంది. కానీ, మీరేం నష్టపోయారో, ఏం పొందగలిగారో తెలుసుకోవాలంటే మీకు చాలా లోకజ్ఞానం అవసరం....”

“నేనేం నష్టపోయినా ఫరవాలేదు. మీ ముఖర్జీ మామ నాకు లభించడమే మహాభాగ్యంగా నేను భావిస్తాను. దాని గురించి నేను రోజూ ఆ భగవంతుడికి దణ్ణం పెడుతూ ఉంటాను. అది సరేగానీ, ఈ పెళ్ళి జరగడానికి పూర్వం నువ్వు గానీ, నీలాంటి యువకులు గానీ నన్ను చేసుకోవడానికి ఎందుకు ముందుకు రాలేదు? నాకిలాంటి తీరని నష్టం జరగకుండా ఎందుకు చూడలేదు? నాకు తెలుసు, విశ్వజిత్, మీలాంటి యువకులకు కావస్సింది అందమైన యువతి కాదు, బోలెడంత కట్నం అని వనిత కొంచెం చిరాగ్గా చెప్పింది.

“అదెందుకంటే, అదెందుకంటే, వనితను చూడటానికి గానీ, పరిచయం చేసుకోవడానికి గానీ అవకాశం దొరకకపోవడం వల్లనే కదా..”

“నాలాగే తమ తలరాతల్ని తిట్టుకుంటూ, అవివాహితలుగా బతుకుతున్న ఎంతోమంది వనితలు ఈ రోజు కూడా కలకత్తా నగరంలో ఉన్నారు కావాలంటే నువ్వు వెళ్ళి వెదికి చూడు.”

దానికేం జవాబివ్వాలో విశ్వజిత్‌కి తోచలేదు. ఎలాగైనా సరే, తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉండాలని అతను దృఢనిశ్చయంచేసుకున్నడు. ఏదో ఒక రోజు వనితను

లొంగదీసుకోవడం సాధ్యం అవుతుందని ఆశించాడు. రోమ్ నగరాన్ని ఒక్క రోజులో నిర్మించలేదని అతనికి తెలుసు. కూర్చునితింటే కొండలైనా కరిగిపోతాయని కూడా తెలుసు. అందుకే, ఆశలన్నీ గాలికొదిలేసి, అనంతశయనావస్థకు విధేయం కాకుండా తన లక్ష్యాన్ని వీలున్నంతవరకూ సమీపిస్తుంటే అనుసందానం చేస్తూ ఉంటే, కొంత కాలంలోనే కామసిద్ధి సూచకమైన స్థూల తిలకం ధరించడానికి సాధ్యమవుతుందని అతను విశ్వసించాడు. అదే సమయంలో, అతని యుక్తివాదాలను తగినట్టుగా ఎదుర్కొనే శక్తిలేని వనిత, సదాచారాల ప్రాధాన్యత గురించి, నొక్కి చెప్పడంతోపాటు విశ్వజిత్‌కి కోపం తెప్పించకుండా, చాతుర్యంగా మాట్లాడుతున్న ఒక సుభాషిణిగా పాత్రధారణ చేసింది.

రెండు మూడు సార్లు వనిత ఛటర్జీ భార్యతో కలిసి సినిమాలు చూడటానికి వెళ్ళిందని తెలిసిన జాయ్‌ముఖర్జీ అస్వస్థుడయినాడు. వయస్సు మళ్ళిన ఒక స్త్రీతో ఆమె సినిమాకు వెళితే ఈయనకెందుకు అస్వస్థత? కానీ, ఈ సినిమాలకు మూడు టిక్కెట్లు తీసుకునేవాడూ, ఆ ఇద్దరి స్త్రీలకు బాడీగార్డ్‌గా వెళ్ళే వాడూ విశ్వజిత్ అని తెలియడమే ఈ అస్వస్థతనకి కారణం. ఈ విషయం తెలుసుకోవడానికి అతను గూఢచారిని గానీ, రహస్య పోలీస్‌ని గానీ ఏర్పాటు చేయలేదు. ఎందుకంటే, ఏ రోజు జరిగిన విషయాలని ఆ రోజు రాత్రి అతనికి చెప్పడం వనిత అలవాటు. తన మీద నమ్మకం పెట్టుకుని తనకు అన్ని విషయాలు దాచకుండా చెప్పే ఆమెను, “సినిమాలో విశ్వజిత్ నీ పక్కన కూర్చున్నాడా? లేక మీ ఇద్దరి మధ్యనా అతని అక్క కూర్చుందా? అని అడగటానికి అతని మనసు అంగీకరించలేదు. ఛీఛీ అతను వనితను ఆనుకుని కూర్చున్నాడా? వాళ్ళిద్దరూ ఒకే పాకెట్‌లోని పాప్‌కార్న్ తిని ఉంటారా?.... అలా అలోచించి అతని మనసు కలత చెందింది. చివరికి తన సంకోచాన్ని కొద్దిగా పక్కకి నెట్టేసి వనితకు ఉపదేశించాడు.

“వనిదా! నువ్వు ఏం చేసినా నాకు అభ్యంతరం లేదు. కానీ, ఆ విశ్వజిత్ ఉంటే మాత్రం నువ్వు మిసెస్ ఛటర్జీతో సినిమాకు వెళ్ళవద్దు. అతను మంచివాడు కాదు. ఆడపిల్లలు కనిపిస్తేచాలు, వాళ్ళవెంటపడతాడు. నా చెల్లెళ్ళకి కూడా అతను ఒక న్యూసెన్స్ లాగా ఉండేవాడు. ఈ లొకాలిటీ లోని వాళ్లకి అతని మీద మంచి అభిప్రాయం లేదు. అతనితో నువ్వు సినిమాకు గానీ, షాపింగ్‌కు కానీ వెళితే, నీ గురించి కూడా నలుగురూ నానారకాలుగా మాట్లాడుకుంటారు.

“సరే అలా అయితే నేను అతనితో బయటకు ఎక్కడికీ వెళ్ళను. కానీ, ఇప్పటివరకూ నాతో అతను చాలా మర్యాదగానే ప్రవర్తించాడు.” అని వనిత చెప్పేటప్పుడు, అతని మనః క్షోభకు కొంచెం ఉపశమనం కలిగింది.. అంటే, .ఇంత వరకూ అతను హద్దులు

దాటలేదన్నమాట.. దేవతలారా! మీకు నా వందనాలు. ఈ విషయం గురించి ఆమె విశ్వజిత్‌తో నిర్మొహమాటంగా చెప్పేసింది. అది విని అతను పెద్దగా నవ్వాడు.

"వనితా! ఇది నేననుకున్నట్టే అయ్యింది. అతను మీకు ఇలాంటి ఉపదేశ మివ్వకపోతేనే ఆశ్చర్యపడాలి. ఈ వయస్సులో ఉన్న ఏ భర్తా యవ్వనయుక్త అయిన, మరియు రూపవతి అయిన భార్యని కాస్తయినా అనుమానించకుండా ఉండడు. భార్య దారితప్పకుండా చూడాల్సిన కర్తవ్యం అతనిదే కదా! భార్యని అమితంగా ప్రేమించడం వల్ల ఇలాంటి వాళ్ళు ఎక్కువగా పొసెసివ్ అవుతారు. భార్యవేరే మగవాళ్ళని కన్నెత్తి చూసినా వారితో మాట్లాడినా వారు సహించరు. ఇక నా వల్ల నీకేమీ బాధ కలగదు. నీతో నేను ఎప్పుడూ బయటకు రాను. అది చాలు కదా ఇకముందు మనం మీ ఇంట్లో కానీ, మా ఇంట్లో కానీ కలుసుకుందాం. నాకు కావాల్సింది ఇంకేమీ కాదు, నీ సంతోషమే, నీతో ఉన్న మైత్రీబంధంలో నా స్వార్థమనే ప్రమేయమే లేదు. జాయ్‌ముఖర్జీ మామకు కావాల్సింది కేవలం తనను ప్రేమించి, పూజించే ఒక భార్య. అతను తన భార్యను గురించి అసూయపడటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇప్పుడు నువ్వు అతను పిలుస్తున్నట్లే అయ్యానా" అని అతను ఒక చిరునవ్వుతో చెప్పాడు.

"నేనేమయ్యానని?" అని ఆమె అడగకుండా ఉండలేకపోయింది.

"వనితా.... కానీ ఒకచిన్న తేడా...... "నైబర్స్ ప్రైడ్ అండ్ ఓనర్స్ ఎన్వీ"

వాళ్ళిద్దరూ కొంతసేపూ హేపీగా నవ్వుకున్నారు. ఈ సంభాషణానంతరం వనితకు విశ్వజిత్ ఇంకా దగ్గరయినట్లు అనిపించింది ఎంత మంచి స్వభావం గల యువకుడు! ఏవిషయాన్నైనా ఎంత తేలిగ్గా తీసుకుంటాడు! మనిషి ఎంతో ప్రాక్టికల్‌గా ఉన్నాడు. జీవితాన్ని వీలైనంత వరకూ ఆస్వాదించడమే అతని ధ్యేయం. దానితోపాటు అతనిలో ఉన్న ఉత్సాహం ఇతరులలో కూడా ఉత్తేజం కలిగిస్తుంది. అతనితో మాట్లాడుతూ కూర్చుంటే సమయం ఎలా గడిచిపోతుందో తెలియదు. మామూలు యవకుల్లో కనబడే దుడుకుతనం ఇతనిలో లేదు. ఇతనంత యువకుడేం కాదు కదా! మూడు దశాబ్దాలు దాటిన పరిపక్వత చెందిన ఒక వ్యక్తే కదా ఇతను. అతని అణువణువులో మర్యాది నిండి ఉన్నట్టు అనిపిస్తుంది. ఈ ఆలోచనలతో మానసికంగా ఆమె అతనిక ఇంకా చేరువయ్యింది. అతనికి తనపట్ల అపరిమితమైన అనురాగముందని ఆమెకు అర్థమైంది.

ఒకరోజు వాళ్ళిద్దరూ కూర్చుని మాట్లాడుతున్నప్పుడు, "వనితా! పగలంతా ఇంట్లో వంటరిగా కూర్చోకుండా ఏదైనా ఉద్యోగం చేయడమే నీ ప్రశ్నలకి సమాధానం. ఇంతకాలమైనా ముఖర్జీ మామ తన కంపెనీలో నీకేదైనా ఉద్యోగం ఇప్పించలేదే!" అని విశ్వజిత్ రిమార్క్ చేశాడు.

"దీని గురించి నేను వారితో చాలా సార్లు మాట్లాడి చూసాను. పాపం, ఆయన తన కంపెనీలోనే కాదు, వేరే కంపెనీల్లో కూడా ఉద్యోగాల గురించి ప్రయత్నిస్తున్నారు. కానీ, ఈ కాలంలో ఉద్యోగాలు దొరకాలంటే... అదీ ఈ కలకత్తా నగరంలో అంత సులభమైన విషయమా? కానీ, నా జీవితంలోని అతిపెద్ద అభిలాష..." అని తన అభిప్రాయాన్ని ఆమె ప్రకటించింది.

"అది నేను చూసిపెడతాను. కానీ, నీ అభిలాషను నేను తీరిస్తే, నువ్వు నాకేమిస్తావు?"

"నీకేం కావాలి? చేపల కూరతో మంచి భోజనం పెడితే చాలు కదా?'

"నాకు ఎప్పుడూ ఏది కావాలన్నా అడిగి తీసుకుంటాను. నీ ఉద్యోగ విషయం మాట్లాడటానికి మా మేనేజింగ్ డైరెక్టర్‌ను డిన్నర్‌కి మా ఇంటికి పిలుస్తున్నాను. నిన్ను చూసి అతను తప్పక సంతోషిస్తాడు. ఆ కమలేష్‌రాయ్ చాలా మంచివాడు."

"ఓహ్! మంచిపేరు, ముసలివాడేనా?"

"అలా అడిగితే నేను కాదనే చెప్పాలి. జాయ్ ముఖర్జీ మామ ముసలివాడని అంటే నీకు ఇష్టమా?.... ఇతనిది కూడా అదే వయసు."

వాళ్ళిద్దరూ మళ్ళీ నవ్వుకున్నారు. వనితలో కొత్త ఆశలు చిగురించాయి. తను ఉద్యోగానికి వెళ్లబోయే రోజుల గురించి ఆమె పగటి కలలు కనడం మొదలు పెట్టింది. తన మంచి భవిష్యత్తు కొరకు ప్రయత్నిస్తున్న ఆ యువకుడి పట్ల ఆమెకు అమితమైన అభిమానం, అంతకు మించి కృతజ్ఞతా భావం కలిగాయి.

ఛటర్జీ ఇంట్లో ఏర్పాటు చేసిన ఆ డిన్నర్ పార్టీ చాలా గొప్పగా జరిగింది. ప్రధాన అతిథి అయిన కమలేష్‌రాయ్‌కు మద్యంతో కూడిన ఆ డిన్నర్ చాలా నచ్చింది. తన సెక్రటరీ అయిన విశ్వజిత్‌తో అతను ఎంతో సహృద్భావంతో వ్యవహరించడం చూసి, ఛటర్జీకి, జాయ్ ముఖర్జీకి, వారి భార్యలు ఎంతో ఆశ్చర్యం కలిగింది. వాళ్ళందరితో కూడా అతను ఉల్లాస పూర్వకంగా మాట్లాడటం జరిగింది. వనిత కూడా ఆయనకు బాగా నచ్చింది.

జాయ్ ముఖర్జీకి రెండు మూడు నెలలకొకసారి కలకత్తా దాటి బయటికి టూర్ వెళ్ళవలసి వస్తుంది. మామూలుగా ఆయన వెళ్ళేది ఢిల్లీ లేదా బొంబాయి. అలా వెళ్ళినా ఆయన త్వరగా పని ముగించుకొని మూడో రోజు కల్లా వచ్చేస్తాడు. యాత్రావేళల్లో అతనితోపాటు వనిత ఉంటుంది కానీ, ఆమె కోసం అతను టిక్కెట్టు తీసుకునేవాడు కాదు. ఎందుకంటే, ఆమెని వేరెవరికీ కనిపించకుండా తన మనసులో దాచి ఉంచుతాడు. అంటే,

ఆమెని మనసులో స్మరించేది యాత్రాసమయల్లో మాత్రమేనని అపార్థం చేసుకోకండి. కలకత్తా దాటివెళ్ళి తిరిగి ఇంటికి వచ్చేటంత వరకూ అతని మనసు గిలగిలా కొట్టుకొనేది. ఆ కొట్టుకోవడానికి ప్రధాన కారణం విశ్వజిత్తే.

ఆ విధంగా ఒకసారి జాయ్ ముఖర్జీ బాంబే వెళ్ళిన రోజు విశ్వజిత్ వనిత దగ్గరకి పరుగెత్తుకు వచ్చాడు.

"వనితా!వనితా! నీకు ఉద్యోగం వచ్చేసింది. రేపు ఉదయం పదకొండు గంటలకు నీకు ఇంటర్వ్యూ. ఇంటర్వ్యూ చేసేది మరెవరో కాదు మా బాసే. రేపు మనల్ని తీసుకువెళ్ళడానికి వారే కారు పంపిస్తున్నారు. బహుశా రేపే మీరు జాబ్‌లో జాయిన్ కావచ్చేమో. ఉదయం స్నానం చేసి, పూజచేసుకుని, మంచి చీరకట్టుకుని, పదిగంటలకల్లా తయారయి ఉండాలి" అని అతను చాలా సంతోషంగా చప్పాడు.

ఆ రోజంతా ఆమె మనసు ఆనందంతో గెంతులు వేసింది. ఆ రాత్రి ఆమెకు నిద్ర పట్టలేదు. తెల్లవారు జామున ఆమెకు కాస్త విశ్రాంతి లభించింది.

ఉదయం పదిగంటలకు వాళ్ళిద్దరూ కారులో బయలుదేరారు. కారు వెళ్ళిక మలేష్‌రాయ్ కంపెనీ గెస్ట్‌హౌస్ ముందు ఆగింది. వనిత కొంచెం ఖంగారు పడింది.

"ఏంటీ, విశ్వజిత్! ఇది ఆఫీస్‌లా లేదే. ఇది గెస్ట్‌హౌస్ కదా!"

"అవును కదా మరి! నువ్వు ఏమనుకుంటున్నావు? యం.డి.గారు స్వయంగా ఇంటర్వ్యూ చేసేటపుడు అది ఆఫీసులో ఎలాచేస్తారు? ఆఫీసులో జరిగేవి చిన్న చిన్న ఇంటర్వ్యూలు మాత్రమే. ఇక్కడ ఆయన సెలక్ట్ చేసేది తన పర్సనల్ స్టెనోగ్రాఫర్‌ని. అది కావాలంటే, ఆయన తన ఇంట్లో అయినా చేసుకోవచ్చు...." అని విశ్వజిత్ ఇచ్చిన జవాబు ఆమెకు నమ్మదగినదిగా అనిపించింది.

అతను ఆమెను కమలేష్‌రాయ్ కూర్చుని ఉన్న గదిలోకి తీసుకుని వెళ్ళాడు. అది ఒక విశాలమైనగది. ఒక పక్కన చాలా అందమైన రెండు మంచాలు. ఆ గది సగం వరకూ ఒక డ్రాయింగ్ రూమ్‌లా ఉంది. రెండు సోఫాలూ, నాలుగు కుర్చీల మధ్య ఎత్తుతక్కువగా ఉన్న ఒక బల్ల. కుర్చీలకు, సోఫాలకు పక్క పక్కన టీపాయ్‌లు. మధ్యలో ఉన్న బల్లమీద రెండు పళ్ళాలు వాటిలో రకరకాల పండ్లు, ఒక టీసెట్టు, అది కాకుండా కోకాకోలా, లిమ్కా మొదలైనవి కూడా.

కమలేష్ వాళ్ళకు చాలా ఆహ్లాదంతో స్వాగతం పలికాడు. తినడానికి, తాగడానికి ఏం కావాలని అడిగితే వనిత ఒక కప్పు టీ మాత్రం చాలని చెప్పింది. మూడు కప్పుల్లో విశ్వజిత్ టీ పోశాడు. ఒక కప్పు అతను తీసుకున్నాడు. టీత్రాగే ముందే రెండు అరటిపండ్లు, మూడు బిస్కెట్లు అతను స్వాహా చేశాడు.

సార్! ఒక మీరు ఇంటర్వ్యూ మొదలుపెట్టండి. నేను బయటకు వెళతాను. అని చెప్తూ విశ్వజిత్ బయటకు వెళ్ళబోయేటపుడు.

"విశ్వజిత్! మీరు కూడా ఇక్కడే వుండండి" అని భయంతో వణుకుతూ వనిత అతనిని అభ్యర్థించింది.

"అది పద్ధతికాదు వనితా! సార్ ఇంటర్వ్యూ చేసేటపుడు నేను ఇక్కడ ఉండకూడదు. ఇట్ ఈజ్ నాట్ ఆఫీస్ ఎటిక్వెట్" అని చెప్తూ ఆమె ప్రతిస్పందన కోసం ఎదురుచూడకుండా అతను నిష్క్రమించాడు.

అతనితో సహకరిస్తోందా అన్నట్లు ఫ్లష్‌డోర్ కూడా అతని వెనకాలే మూసుకు పోయింది.

"వనితా! నువ్వేం భయపడవద్దు. ఇంకా చాలాకాలం కలిసి పనిచేసేవాళ్ళం మనం."

ఆమె భయంతో గజగజలాడుతూ కూర్చుండిపోయింది...నిముషాలు మెల్లగా గడిచిపోయాయి. దుర్భరమైన నిముషాలు, గడిచిపోకుండానే గడిచిపోతున్న నిముషాలు.

"వనితా! నా దగ్గరగా వచ్చి కూర్చోండి."

"వద్దు సార్! నేనిక్కడే కూర్చుంటాను. తమరు అడగాల్సిన ప్రశ్నలు అడగండి. నాశక్తికొలది నేను జవాబు లివ్వడానికి ప్రయత్నిస్తాను."

"నిన్ను ప్రత్యేకంగా అడగాల్సిన ప్రశ్నలేమీ లేవు. నీ సెలక్షన్ ఎప్పుడో అయిపోయింది. నిన్ను డిన్నర్‌లో చూసినప్పుడే నాకు చాలా బాగా నచ్చావు. ఆరోజే మీ సెలక్షన్ అయిపోయింది. ఇంటర్వ్యూ ఒక ఫార్మాలిటీ మాత్రమే. కమాన్ డియర్..కమ్ అండ్ సిట్ క్లోజ్‌టుమీ."

"సర్..సర్....ప్లీజ్..తమరి దగ్గరగా కూర్చోవడం నా వల్లకాదు. నేనలాంటి స్త్రీని కాను."

"వనితా! నువ్వు చాలా మంచిదానివి. అందుకే కదా నాకు నచ్చావు. నీకు నా దగ్గరకు రావడానికి సిగ్గైతే వద్దు, రావద్దు, నేనే నీ దగ్గరకు వస్తాను.."

"సర్...వద్దు సర్.." ఆమె ఒక్క ఉదుటున లేచి నిలబడింది.

"భయపడకమ్మా! నేను మృగాన్నేం కాదు. నిన్ను కరిచెయ్యను, కొరికెయ్యను." అంటూ అతను మెల్లగా ఆమె వైపు కదిలితే, ఆమె చటుక్కున తలుపువైపు పరిగెట్టింది.

"నువ్వు బయటకు వెళ్ళలేవు. విశ్వజిత్ తలుపు బయట నుంచి గడియ వేసి వెళ్ళాడు. మన మధ్య ఏం జరగకపోయినా విశ్వజిత్ మాత్రం నమ్మడు. అందుకే నువ్వు ఇక ఆలోచించాల్సింది నీ భాసురమైన భవిష్యత్తు గురించి, మనం హాయిగా బతుకుదాం. నేను తలుచుకుంటే, నీకెంతో తోడ్పడగలను. మన మధ్య జరిగే విషయాలను మూడోకంటి వాడికి తెలికుండా జాగ్రత్త తీసుకుంటాను."

"మీరు నన్ను క్షమించాలి. మీరు నా తండ్రిలాంటి వారు. మీ కూతురులాంటి దాన్ని"

"వనితా! నువ్వు అనేది ఒక విధంగా కరక్టే, నువ్వు నాకు నచ్చడానికి ప్రధాన కారణం నీ వయస్సే, మరొక విషయమేమిటంటే, నీ వయస్సు గల కూతురు నాకు లేదు గానీ, నా వయస్సు గల భర్త నీకున్నాడు కదా! అందుకే మన వయస్సుల అంతరం మన బంధానికి అభ్యంతరం కాదు. మైడియర్ ఒనితా! కొంత ఇంగిత జ్ఞానంతో మెలగు. నీ జీవితమంతా సురక్షితంగా, సుఖకరంగా గడిచిపోవడానికి, ఈ రోజు పునాదిరాయి వేయబోతున్నావు."

"వద్దు సార్! అలాంటి సురక్ష గానీ సుఖం కానీ నాకొద్దు సార్. దయచేసి నన్ను వదిలెయ్యండి" అంటూ, ఆమె తలుపు తట్టడం మొదలుపెట్టింది.

"వనితా! నువ్వు తలుపు తట్టినా, అల్లరి చేసినా అది చూసేవాళ్ళు, వినేవాళ్ళు ఈ చుట్టుపక్కల ఎవరూ లేరు. విశ్వజిత్, డ్రైవర్ తిరిగి రావడానికి ఇంకా గంట పడుతుంది. వాళ్ళు వచ్చిన తరువాతే ఈ తలుపు తెరువబడుతుంది. ఆ తరువాతే నువ్వు బయటకు వెళ్ళడం. మరో గంట వరకూ ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లో సుఖంగా గడపడమే సమంజసం. నీకు సినిమా సంగీతం పట్ల అసక్తిగా ఉంటే, బాబీ సినిమాలో లాగా "హమ్ తుమ్ ఏక్ కమరేమే బంద్‌హో ఔర్ చాబీఖో జాయే" అని పాడుకుందాం." ఏది ఎలాగయినా, ఒక గంటసేపు ఇంటర్వ్యూ జరగాల్సిందే కదా. అలా నిలబడి వణుకుతావేం, ఆ వణుకుడేదో కూర్చునే వణుకు. నీకిష్టం వచ్చినచోట కూర్చో. బలవంతం చేయడానికి నేనేం పోలీసు వాణ్ణికాను. ఎందుకా భయం? నాకింత వయసుంది కదా! దౌర్జన్యానికి పాల్పడను. తలుపు తెరిచేంత వరకూ కావాలంటే ఇక్కడున్న పేపర్లు, పత్రికలు చదువుకో అంత వరకూ నేను వనిత అనే సుందరాంగిని చూస్తూ, ఆస్వాదిస్తూ కూర్చుంటాను. కానీ, అయామ్ సారీ....నువ్వెంత మంచి దానివైనా ఇంతర్వ్యూలో సహకరించకపోతే, నువ్వు నా స్టెనోగ్రాఫర్‌వి కాలేవు. ఇక మిగిలిన ఈ టైములో "కిం కరణీయం" అని నువ్వే నిర్ణయించుకోవచ్చు. ఈ లోపల నీ మనసు మారిన క్షణంలో ఒక చిన్న చిరునవ్వు విసిరితే నేను నీ దగ్గరకు పరుగెత్తుకుని

వస్తాను. అంత వరకూ ఎంతో ఓపికతో, ప్రతీక్షతో, నీ ప్రతిబింబాన్ని నా కంటిపాపలో నిక్షిప్తం చేసుకుంటాను. ఈ గంటలోపు నీ మనసు మారితే నేను ధన్యుణ్ణి అయినట్టు భావిస్తాను. దానితో సౌభాగ్యాల వెల్లువ నీ సొత్తే. అలాంటి బంగారు భవిషత్తులో భోగభాగ్యాలు మన పరస్పరం పంచుకుందాం."

"ఐయామ్ వేరీ సారీ సర్," అని చెప్తూ, వణుకుతున్న చేతులతో ఒక మ్యాగజైను తీసుకుని, కుర్చీ అంచున ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని చదవడం మొదలుపెట్టింది. అప్రతస్త హరిణ శాపకంలా ఉన్న ఆమెకు అరగంట తర్వాత ఈ పులికి వేటాడే ఉద్దేశ్యం లేదని గ్రహించడంతో, మనసు కుదుటపడింది. ఒక గంట కారాగారవాసం తరువాత, స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే సరికి, ఆమెకు ధైర్యం తిరిగి వచ్చింది. తిరిగి వెళ్ళేటప్పుడు, విశ్వజిత్ సహాయ సహకారాలను తిరస్కరించి, ఆమె ఒంటరిగా ఒక టాక్సీకారులో వెళ్ళింది. ఆ పక్కింటబ్బాయి ముఖం కూడా ఆమె చూడలేదు.

జాయ్‌ముఖర్జీకి వచ్చిన వెంటనే జరిగినదంతా పూస గుచ్చినట్టు చెప్పి, ఆ విషయాన్ని విశ్వజిత్ దగ్గర, ఛటర్జీ దగ్గర ప్రస్తావించవద్దని వనిత కోరింది. ఎప్పటికైననా, జాయ్‌ముఖర్జీ చూసిపెట్టే ఉద్యోగంలోనే చేరతానని ఆమె ఖచ్చితంగా చెప్పింది.

ఆ అవాంఛనీయ సంఘటన గురించి బాధపడవద్దని నచ్చచెప్పి, ఇతర విషయాలపై ఆమె మనసును మళ్ళించి, ఆమెను నవ్వించడానికి అతను ప్రయత్నిస్తూ ఉండగా,

"నా గురించి ఆ విశ్వజిత్" ఓనర్స్ జెలసీ నైబర్స్ ప్రైడ్" అని ఒకసారి చెప్పాడు కదా! అందుకుని మీరు ఇప్పట్నుంచి నా పేరుతో పిలవద్దు. నన్ను "నీతూ" అని పిలవండి. అని వనిత ఒక చిన్న సలహా ఇచ్చింది.

"అయ్యో! అలా పిలవడానికి నేను రిషికపూర్‌ని కానే. అయినా నువ్వుచెప్పావు కాబట్టి ఇక నుంచి అలాగే పిలుస్తాను. ఇహ నా నీతుపై నాకు అభిమానం మాత్రమే ఉంటుంది, అసూయ కాదు. అంటే, ఈ రోజు నుంచి నువ్వు "ఓనర్స్ ప్రైడ్ నైబర్స్ ఎన్వీ" అవుతున్నావు కదా?" అని అడుగుతూ ఆమెను దగ్గరగా తీసుకుని ఆమె రెండు బుగ్గలమీదా ముద్దుల వర్షం కురిపించాడు.

వనిత తర్వాత ఎప్పుడూ విశ్వజిత్‌తో మాట్లాడలేదు. క్షమాభిక్ష కోరడానికి అతను ఆమె దగ్గరకు వచ్చాడు కానీ, అతని ముఖం చూడడానికి కూడా ఆమె నిరాకరించింది.

ఇంకా కొద్ది రోజుల తర్వాత, విశ్వజిత్ కమలేష్ రాయ్ కంపెనీలో ఉద్యోగానికి రాజీనామచేసి, వేరే ఏదో కంపెనీలోజాయిన్ అయినట్లు ఒక వార్త......